విద్యార్థులకు బూట్లు, బెల్టుల పంపిణీ

ప్రజాశక్తి-పెదబయలు: స్థానిక గిరిజన బాలుర రెసిడెన్సియల్ పాఠశాలను బుధవారం స్థానిక జడ్పీటీసీ కూడా బొంజుబాబు సందర్శించారు. అనంతరం విద్యార్థుల బాగోగులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం షూస్, బెల్ట్ తదితర సామగ్రిని విద్యార్థుల కు పంపిణీ చేసారు. స్కూల్ స్థాపించి 20 ఏండ్లు గడుస్తున్నా సుమారు 800 మీటర్ల వరకు రోడ్డు సౌకర్యం లేదని, వర్షాకాలం లో వసతి గృహానికి స్టాక్ రావాలన్నా ఇబ్బంది పడాల్సి వస్తుందని, రోడ్డు మంజూరు చేయాలని స్థానికులు విన్నవించారు. ఐదు లక్షల జడ్పీ నిధులు మంజూరు చేపించి సిసి రోడ్డు వేయిస్తామని ఆయన తెలిపారు.

బూట్లు ఇస్తున్న జెడ్పిటిసి

మేము బడికి వెళ్తాం... ఉపాధ్యాయున్ని నియమించరూ..

- కాకరపాడు విద్యార్థుల ఆవేదన

ప్రజాశక్తి -అనంతగిరి: సుమారు 20 మందికికి పైగా విద్యార్థులు ఉన్నాం...ఉపాధ్యాయుడిని నియమించాలని మండలంలో ఓ పాఠశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలు...మండలంలోని పైనంపాడు పంచాయతీ పరిధి కాకరపాడు ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు ప్రమోషన్‌తో బదిలీ అయ్యారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాల పున్నప్రారంభించినా నేటి వరకు ఉపాధ్యాయుడి నియామకం చేపట్టలేదు. ఆ గ్రామానికి చెందిన సుమారు 20 మందికి పైగా విద్యార్థులు రోజు ఉదయం పూట పాఠశాలకు వస్తున్నారు. ఉపాధ్యాయుడు లేక పోవడంతో ఆటలు ఆడుకుంటూ విద్యార్థులు ఇంటి బాట పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

మండల విద్యాశాఖ అధికారి బాలాజీని వివరణ కోరగా కాకరపాడు పాఠశాలతో పాటు మండలంలో సుమారు 21 పాఠశాలలకు ఉపాధ్యాయుల కొరత ఉందని తెలిపారు. 11 పాఠశాలలకు వేరే పాఠశాలల నుండి డిప్యూటేషన్ కింద తాత్కాలికంగా టీచర్లను నియమించామన్నారు.మరికొన్ని పాఠశాలలకు సర్దుబాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. త్వరలో సర్దుబాటు చేస్తామన్నారు. దీనిపై ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

సమస్యల పరిష్కారానికి వినతి

వినతిపత్రం అందజేస్తున్న వైస్ ఎంపిపి, ఇతర నేతలు

ప్రజాశక్తి- కూనవరం : గ్రామాల్లో రోడ్లు, మంచినీటి సమస్యలను పరిష్కరించాలని. చింతూరు ఐటిడిఎ ప్రాజక్టు అధికారి సూరజ్ గనోరేకు వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య మాట్లాడుతూ కూటూరు గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకంలో నిధులు మంజూరు చేసి గ్రామానికి మంచినీరు అందించాలని కోరారు. గ్రామంలో రోడ్ల పరిస్థితి చాలా దారుణంగా ఉందని, సి. సి రోడ్లను మంజూరు చేయాలని కోరారు..పెద్దర్కూర్ పంచాయితీలో గండి కొత్తగూడెం బిటి రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. రేపాక గ్రామంలో జలజీవన్ మిషన్ ట్యాంక్ నిర్మాణంలో ఉందని దానిని త్వరిత గతిన పూర్తి చేసి గ్రామానికి మంచినీరు అందించాలని అన్నారు. సచివాలయం పరిధిలో లైన్ మెన్‌లను నియమించినప్పటికీ వారు అక్కడ పని చేయడం లేదని, సంబంధితశాఖ ఉన్నతాధికారులు వారిని విద్యుత్ కార్యాలయాల్లో ఉంచుకని పనిచేయించుకుంటున్నారని, దీంతో గ్రామాల్లో విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. లింగా పురం, రేగుల పాడు గ్రామాల మధ్య కూలిన వంతెనను పునర్నిర్మించాలని కోరారు.కార్యక్రమంలో ఎంపిటిసి అమ్మాజి, సర్పంచ్ నాగమణి, బొగ్గా వెంకమ్మ పాల్గొన్నారు.

కలెక్టర్ విజయసునీతకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-పాడేరు: స్వచ్ఛమైన గిరిజన ప్రాంతం, అందమైన ప్రకృతి ఒడిలో సేవలందించడం అదృష్టంగా భావిస్తున్నానని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట్ అధ్యక్షతన బదిలీపై వెళుతున్న జిల్లా కలెక్టర్ను అన్ని ప్రభుత్వ శాఖల, రెవెన్యూ అధికారులు కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అందరి సహకారంతో పక్కా వ్యూహంతో ఎన్నికల విధులను విజయ వంతంగా నిర్వహించామని చెప్పారు. ఉమ్మడి విశాఖ జిల్లా సువిశాలమైనదన్నారు. నాలుగు నెలలు అధికారులతో పని చేసానని తెలిపారు. పొలిటికల్ పార్టీలు, పాత్రికేయులు చక్కని సహకారం అందించారని కొనియాఆరు. ఎన్నికల నేపథ్యంలో సామాజిక పింఛన్లు, వైద్యపరమైన సేవలలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపామన్నారు. జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు ఎన్నికల సమయంలో చక్కని సహకారం అందించారని పేర్కొన్నారు.అమ్మవారి జాతరను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతంగా నిర్వహించగలిగానన్నారు.

జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా ఎన్నికలు నిర్వహణలో జిల్లా కలెక్టర్ తమకు అండగా నిలిచి నిరంతరం సహకారం అందించారని చెప్పారు. ఎప్పటికప్పుడు సూచనలు చేసేవారని చెప్పారు.

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.రంపచోడవరం ఐటిడిఏ పిఓ సూరజ్ గనోరే మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ నాయకత్వంలో ఎన్నికలను విజవంతం చేసామన్నారు. రంపచోడవం సబ్ కలెక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో నిరంతరం సలహాలు, సూచనలు ఇస్తూ కలెక్టర్ అందించిన సహకారంతో ఎన్నికలను విజయవంతం చేసామన్నారు. పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి మాట్లాడుతూ, భౌగోళికంగా అతిపెద్ద జిల్లా, సెక్యూరిటీ సమస్యలున్నప్పటికి సార్వత్రిక ఎన్నికలను విజయవంతం చేసారన్నారు. ఈ కార్యక్రమంలో చింతూరు ఆర్‌డిఓ చైతన్య, ఎస్పీ ధీరజ్, డిఆర్‌ఓ బి. పద్మావతి, ఎస్‌డిసిలు వివిఎస్ శర్మ, భవాని, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డివిఆర్. ఎం.రాజు, డి. ఆర్.డి.ఏ .పిడి మురళి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ భాషా, జిల్లా వ్యవసాయాధికారి నంద్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకలు ఐ.కొండలరావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

సత్కరిస్తున్న జాయింట్ కలెక్టర్, అధికారులు

విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పట్టం పంచాయతీ బూరువలస గ్రామంలో పొంచి ఉన్న ప్రమాదం, తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాల పేరుతో సోమవారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి బుధవారం మూడు నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. తుప్పు పట్టిన స్తంభాలను తొలగించి దాని స్థానంలో కొత్తవి అమర్చారు. 17 ఏళ్ల సమస్యను పరిష్కారం కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

బస్‌షెల్టర్‌ను వినియోగంలోకి తెస్తాం

బస్‌షెల్టర్‌ను పరిశీలిస్తున్న యుబిఐ మేనేజర్ చిన్నబాబు, సర్పంచ్ రాజు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం దారకొండలో బస్ షెల్టర్‌ను వినియోగంలోకి తెస్తామని సీలేరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ చిన్నబాబు వెల్లడించారు. గతంలో యూనియన్ బ్యాంకు ఆర్థిక సహాయంతో ప్రయాణకుల కొరకు నిర్మించిన బస్ షెల్టర్ ను ధారకొండ ప్రధాన రహదారి సమీపంలో నిర్మించారు. ఈ భవనంలో ప్రయాణికులు బస్సు వచ్చేవరకు వేచి ఉండి ప్రయాణించేవారు. కొంతకాలంగా బస్సెల్టరులో మతిస్థిమితం కోల్పోయిన మహిళ ఉండడంతో ప్రయాణికులు అందులో వేచి ఉండడానికి ఇష్టపడేవారు కాదు. మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోయిన ర్వాత ఇదే అదునుగా భావించిన స్థానిక వ్యాపారులు బస్సు షెల్టర్‌ను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో ప్రయాణికులు బస్సు గురించి వేసి ఉండాలంటే వర్షం వచ్చిన ఎండ వచ్చిన అనేక ఇబ్బందులు గురవుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ దృష్టికి ధారకొండ సర్పంచి ఎన్. రాజు తీసుకొచ్చారు. ఇటీవల పత్రికల్లో కూడా బస్సు షెల్టర్ వినియోగంలో తేవాలని వార్తలు రావడంతో మేనేజర్ చిన్నబాబు స్పందించారు. బుధవారం సిబ్బందితో కలిసి, స్వయంగా వెళ్లి బస్ షెల్టర్‌ను పరిశీలించారు. పది రోజుల్లో బస్సు షెల్టర్ వినియోగంలో తెచ్చేలా కృషి చేస్తానన్నారు. వ్యాపారులు బస్సు షెల్టర్‌లో ఉంచిన సామాగ్రిని తొలగించాలని వ్యాపారస్తులకు ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బుజ్జి పాల్గొన్నారు.

అరకులోయలో కురుస్తున్న వర్షం

మన్యంలో కుండపోత వర్షం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో బుధవారం సాయంత్రం కుండపోత కురిసింది. సాయంత్రం ఐదు గంటల నుంచి ప్రారంభమైన వర్షం ఏకధాటిగా ఏడు గంటల వరకు రెండు గంటల పాటు కురిసింది. వర్షం కారణంగా మండల కేంద్రంలోని వీధి కాలువలు,రోడ్లు పూర్తిగా జలమయంగా మారాయి. మన కేంద్రంలోని మూడు రోజుల జంక్షన్ గుంటసీమ రోడ్డుపైకి వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలో మురుగునీరు నివాస గహాలకు నీరు చేరడంతో స్థానికులు పలు ఇబ్బందులు పడ్డారు. బుధవారం కించుమండలో జరిగిన వారపు సంతకు వచ్చిన గిరిజనులు, వివిధ పనుల నిమిత్తం మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చిన గిరిజనులు తిరుగు ప్రయాణంలో పలు ఇబ్బందులు పడ్డారు.

అరకులోయ: అరకులోయ పరిసర ప్రాంతాల్లో బుధవారం కుండపోత వర్షం కురిసింది. నిన్నటి వరకు అడపదడపా వర్షం కురిసి ఆగిపోయేది. దీంతో ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరి అయిన ఈ ప్రాంతవాసులు ఉపశమనం పొందారు. బుధవారం ఉదయం మాత్రం చలికాలాన్ని తలపించే విధంగా దట్టమైన పొగ మంచు కమ్ముకుంది. 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తీవ్రమైన ఎండ కాసింది. తర్వాత మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఉరుములు మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురువడమే కాకుండా పెద్ద పెద్ద శబ్దాలతో పిడుగులు పడడంతో ఈ ప్రాంత వాసులు భయాందోళనకు గురయ్యారు. ఈ మధ్యకాలంలో ఇంత పెద్ద కుండపోత వర్షం కురవడం ఇదే తొలిసారి.సాయంత్రం ఏడు గంటలైనా ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వాహన చోదకులకు రాకపోకలకు అంతరాయం కలగడంతో ఇబ్బంది పడ్డారు. అరకు -విశాఖ రోడ్డులో వర్షపు నీటితో పలుచోట్ల నిండిపోయాయి. దీంతో పలువురు ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకే రోజు వింత వాతావరణం నెలకొని మూడు కాలాలు దర్శన మివ్వడంతో అందరూ ఆశ్వాదించారు.

అన్ని రకాల సరుకులు సరఫరా చేయాలి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు రేషన్ షాపుల్లో అన్ని రకాల నిత్యావసర సరుకులను సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ గిరిజన మహిళా సంఘం జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్.హైమావతి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గత ఐదేళ్లలో సామాన్య ప్రజలకు ధరల భారం అధికమైందన్నారు. గిరిజన ప్రాంతాల్లో పేద ఆదివాసి గిరిజనుల జీవనం ఎంతో వ్యయ ప్రయాసలకు లోనయిందన్నారు. రోజు కూలి పనులు చేసుకుని జీవించే కుటుంబాలకు పూట గడవడం కష్టంగా మారిందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుదల దృష్ట్యా రేషన్ షాపుల్లో బియ్యం, పంచదార తో పాటు మంచి నూనె, గోధుమపిండి, పప్పు దినుసులు, కారం, ఉప్పు తదితర సరుకులన్నీ ప్రజలకు చౌక ధరలపై అందించాలని కోరారు. దీనిపై సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించాలని కోరారు.

హాస్టల్ వర్కర్ల వేతనాలు పెంచాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

ప్రజాశక్తి- చింతూరు : గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఆశ్రమ స్కూల్స్‌లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, వారి శ్రమను దోచుకుందనిసిఐటియు జిల్లా కమిటీ ఆక్షేపించింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలోనైనా హాస్టల్ వర్కర్ల శ్రమను గుర్తించి వారికి న్యాయమైన వేతనాలు పెంచి, చెల్లించాలని డిమాండ్ చేసింది.

బుధవారం చింతూరులో జరిగిన హాస్టల్ వర్కర్ల మీటింగ్‌లో సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ వర్కర్లు రోజుకు14 గంటలు పని చేస్తున్నారని, వారి శ్రమను ధారపోసి విద్యార్థులకు మంచి ఆహారం అందిస్తున్నారని, కానీ వారి శ్రమను గత ప్రభుత్వం గుర్తించలేదని విమర్శించారు. వేతనాలు తక్కువ ఉండడంతో పాటుగా 60 ఏళ్ల దాటిన వారిని విధుల్లోంచి తొలగిస్తున్నారని, దీంతో వారికి పనిచేసే శక్తి లేక, ఆదాయం లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతూ జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ 30 ఏళ్లుగా ఆశ్రమాల్లో పనిచేస్తున్న వీరిని క్రమబద్ధీకరించడంలో ఎవరూ చిత్తశుద్ధి చూప లేదని విమర్శించారు. కొత్తప్రభుత్వం వీరి శ్రమను గుర్తించి కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, సీనియార్టీ ప్రకారం వర్కర్ల క్రమబద్ధీకరించాలని, పిఎఫ్,ఈఎస్ఐ, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని, సంవత్సరానికి రెండు జతల యూనిఫారాలు, ఇవ్వాలని, విద్యార్థుల సంఖ్య కనుగుణంగా వర్కర్ల పోస్టులను పెంచి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం రానున్న కాలంలో కార్మికులపక్షాన పోరాటానికి సిఐటియు సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో దుర్గారావు, చంద్రమ్మ, పుల్లమ్మ, తిరుపతమ్మ, వీరయ్య, నాగేశ్వరరావు, రమాదేవి, చెల్లెమ్మ, రాజమణి, రాంబాబు, వీరాస్వామి, శాంతమ్మ, రాజమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నేత వెంకట్

రేషన్ బియ్యం సత్వర పంపిణీ

రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి-విఆర్ పురం: మండలంలోని అన్ని రేషన్ డీలర్ల పరిధిలో ఉన్న లబ్ధిదారులకు రేషన్ బియ్యం సకాలంలో అందించాలని, ఎవరైనా అలసత్యం వహిస్తే ఊరుకునేది లేదని తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ అదేశించారు. బుధవారం మండల రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. నిత్యవసర సరుకులు పంపిణీలో, తూకాలలో తేడా రాకుండా చూడాలన్నారు మిడ్‌డే మీల్స్‌కు రేషన్ అందించాలన్నారు. ప్రత్యేక సమావేశంలో మండల విద్యాశాఖాధికారి వివి లక్ష్మీనారాయణ, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మడకం రామకృష్ణ, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సిబ్బంది, రేషన్ డీలర్స్ పాల్గొన్నారు..

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా

- ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి
- రంపచోడవరంలో ఘనస్వాగతం

ఎమ్మెల్యే శిరీషాదేవిని గజమాలతో స్వాగతిస్తున్న కూటమి శ్రేణులు

ప్రజాశక్తి-రంపచోడవరం : నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని, నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం తర్వాత తొలిసారి నియోజకవర్గానికివచ్చిన ఎమ్మెల్యేకు రంపచోడవరంలోని సీతపల్లి బాపనమ్మ తల్లి ఆలయం వద్ద తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు తీన్మార్లు ,గిరిజన సాంప్రదాయ రేలా నత్యాలు, కొమ్ము డాన్సులతో ఘన స్వాగతం పలికారు.అనంతరం బాపనమ్మ ఆలయ కమిటీ ఆలయ లాంఛనలతో ఎమ్మెల్యే మిరియాల శిరీష దంపతులను ఆలయంలో తీసుకుని వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుండి విజయోత్సవ ర్యాలీగా బయలుదేరి ఎమ్మెల్యే దంపతులకు అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పట్టారు. రంపచోడవరం అంబేద్కర్ సెంటర్ కు చేరుకున్న ఎమ్మెల్యే దంపతులు అక్కడున్న అంబేద్కర్,ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం మాట్లాడుతూ తనను బిడ్డలా భావించి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. ఎటువంటి రాజకీయ అనుభవం లేకుండా నమ్మి గెలిపించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధి అంటే ఇలా ఉండాలనే విధంగా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు.. నియోజకవర్గంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన పేరు చెప్పి ఎవరైనా దందాలకు పాల్పడితే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. నియోజకవర్గంలోని ప్రజలను పార్టీలకతీతంగా, కుల,మత బేధాలు లేకుండా అందరినీ సమానంగా చూస్తానన్నారు. చంద్రబాబు నేతృత్వంలో ఇప్పుడు ప్రజల వద్దకే ప్రజా పాలన వచ్చిందని, దానికి తాను వారధిగా ఉంటానని భరోసానిచ్చారు. అంబేద్కర్ సెంటర్లో టిడిపి నాయకులు అభిమానులు ఎమ్మెల్యే దంపతులను గజమాలతో సత్కరించారు. రంపచోడవరం నుండి ప్రారంభమైన ర్యాలీ గంగవరం అడ్డతీగల మీదుగా రాజవొమ్మంగి వరకు కొనసాగింది. 11 మండలాల నుంచి కూటమి పార్టీల నాయకులు,,కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

82 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం రంతాడ జంక్షన్ వద్ద నిర్వహించిన పోలీసు తనిఖీలలో రూ. 4.12 లక్షల విలువచేసే 82.5 కిలోల గంజాయిని పట్టుకున్నామని సిఐ అప్పలనాయుడు తెలిపారు. ఒక ఆటో, పల్సర్ బైకు స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితుల్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. సిఐ అప్పలనాయుడు తెలిపిన వివరాలివి. ముందస్తు సమాచారం మేరకు రింతాడ జంక్షన్ వద్ద మంగళవారం సాయంత్రం సిబ్బందితో కాపు కాసి తనిఖీలు నిర్వహించామని, ఒక ఆటో పల్సర్ బైకును ఆపి, తనిఖీలు నిర్వహించగా ఆటోలో 82.5 కేజీలు గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇద్దరు నిందితుల్ని అదుపులో తీసుకుని ఆటో, పల్సర్ బైక్ రెండు టచ్ మొబైల్ ఫోన్లు రూ.720 నగదు స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ తరలించామని తెలిపారు. నిందితులను విచారించగా జీకే వీధి మండలం రేంతాడ పంచాయతీ కమ్మర వీధికి చెందిన ఎం.మురగేష్, చింతపల్లి మండలం బురిగి సింగి గ్రామానికి చెందిన గాలి సత్యనారాయణగా గుర్తించామన్నారు. గంజాయి సరఫరా చేసిన వ్యక్తిని ఆటో డ్రైవర్‌ను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. . అల్లూరి జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా, చింతపల్లి ఎఎస్పి ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణాపై నిరంతరం నిఘా పెడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సై అప్పలసూరి పోలీసులు పాల్గొన్నారు.

గంజాయి నిందితులతో పోలీసులు

మత్తుకు బానిసలు కావద్దు

రంపచోడవరం ర్యాలీలో పిఒ, సబ్‌కలెక్టర్, ఎఎస్‌పి

ప్రజాశక్తి -యంత్రాంగం

రంపచోడవరం : మత్తు పదార్థాలకు బానిసలై నేరాలకు పాల్పడుతూ భవిష్యత్‌ను నాశనం చేసుకోకుండా యువత వాటికి దూరంగా ఉండాలని రంపచోడవరం ఐటిడిఎ సూరజ్ గనోరే పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రంపచోడవరం లోని స్థానిక అంబేద్కర్ సెంటర్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ర్యాలీ మానవహారాలను పిఒ సూరజ్ గానోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, రంపచోడవరం ఎఎస్‌పి జగదీష్ అలహళ్లి, సెబ్ ఎఇఎస్ నాగ రాహుల్ ప్రారంభించారు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామనివిద్యార్థులతో ప్రమాణం చేయించారు అనంతరం రంపచోడవరం ఐటిడిఎ పిఒ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబ వ్యవస్థకు సమాజానికి కూడా దూరమవుతారన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలైన వారివల్లే హత్యలు అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. ఎఎస్‌పి అలహళ్లి మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడటం, వాటిని రవాణా చేయడం నేరమని, పదేళ్ల నుంచి 20ఏళ్ల వరకు జైలుశిక్ష, రూ.రెండు లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రంపచోడవరం ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ కె.లక్ష్మి, సిఐ వెంకటేశ్వరరావు, మోహన్ కుమార్, లెనోవో ఇంజనీరింగ్ కళాశాల, గురుకుల కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వి అర్ పురం: మత్తు, మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని సందర్భంగా విఆర్ పురం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఎస్ఐ కె.నాగరాజు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు మత్తు మాదక ద్రవ్యాలతో యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని నినాదాలు చేస్తూ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విఆర్ పురం జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపాధ్యాయులు, ఎస్ఐ రాధాకృష్ణ పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

రాజవొమ్మంగి: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల హెచ్ఎం గోపాలకృష్ణ అధ్యక్షతన ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని డగ్స్ వినియోగం,వాటి దుష్ప్రభావాలును వివరిస్తూ అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు మానవహారం చేపట్టారు

మోతుగూడెం : మోతుగూడెంలో ఎస్ఐ గోపాలరావు ఆధ్వర్యంలో డ్రగ్స్, మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గంజాయిని పండించడం, అమ్మడం, అక్రమ రవాణా నేరమని, దానికి అందరూ దూరంగాఉండాలని పిలుపునిచ్చారు. మోతుగూడెం సివిల్ పోలీసులు, ఎపిఎస్‌పి బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో డిఎవి స్కూల్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. మానవహారం నిర్మించారు. కార్యక్రమంలో ఎపిఎస్‌పి ఆర్ఎస్ఐ సుమేష్ కుమార్, ఎఎస్ఐ రాజేశ్వరరావు, సూర్యనారాయణరావు, హెడ్ కానిస్టేబుల్ రవిచంద్ర రాజు సన్నీ, ఎపి జెన్‌కో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీలేరు: యువత జీవితం నాశనం చేసే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రామకృష్ణ పిలుపునిచ్చారు. సీలేరులో అంతర్జాతీయ మత్తు పదార్థాలు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ 42వ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ పాండే గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాల,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సీలేరు: జీకే వీధి మండలంలో సీఐ అప్పలనాయుడు, ఎస్ ఐ అప్పలసూరి ఆధ్వర్యంలో డ్రగ్స్ అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. యువతను చెడు మార్గాల వైపు నడిపించే మాదకద్రవ్యాలు అక్రమ రవాణా అమ్మకాలు, వినియోగంపై 931123100 నెంబర్‌కు సమాచారమిచ్చి, వాటిని అరికట్టేందుకు సహకరించాలని కోరారు. ఆపరేషన్ పరివర్తనలో గడచిన మూడేళ్లలో జిల్లాలోని గంజాయిని సమూలంగా నిర్మూలించామన్నారు.

మారేడుమిల్లి: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మారేడుమిల్లి సిఐ రుద్రరాజు భీమరాజు, ఎస్ఐ ఎన్ రాము ఆధ్వర్యంలో మారేడుమిల్లి ప్రధాన కూడలి నుండి గురుకుల బాలుర పాఠశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. గురుకుల కళాశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు...

డుంబ్రిగుడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

డుంబ్రిగుడ: మద్యం, గంజాయి మట్టి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై సంతోష్ కుమార్ సూచించారు. మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కించమండ, డుంబ్రిగూడలో స్థానిక పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి మత్తు పదార్థాలకు అలవాటై జీవితాలను పాడు చేసుకోవద్దని, బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు సంపాదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అరకులోయరూరల్:మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని అరకులోయ సీఐ సిహెచ్ రుద్ర శేఖర్ సూచించారు. మండల కేంద్రంలోని సీఐ రుద్ర శేఖర్, ఎస్ఐ సంతోష్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ నుంచి నాలుగు రోడ్డు కూడలి వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో ఎన్నో అనర్థాలు కలుగుతాయన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండల కేంద్రంలో స్థానిక ఎస్సై ఆదేశాలతో పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. జూనియర్ కళాశాల నుంచి వైయస్సార్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది.ఎఎస్ఐ రాజనాయుడు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో గంజాయి సాగు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ లెక్చరర్స్ తవిటినాయుడు,. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి :స్థానిక హనుమాన్ జంక్షన్ నుంచి డిగ్రీ కళాశాల వరకు చింతపల్లి అడిషనల్ ఎఎస్‌పి ప్రతాప్ శివకిశోర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి వ్యాపారం, అక్రమ రవాణాతో కొన్ని వేల కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని తెలిపారు.

ముంచింగిపుట్టు : మండల కేంద్రంలో స్థానిక ఎస్సై కే.రవీంద్ర ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని నాలుగు రోడ్ల కూడలి నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రభుత్వ జూనియర్ కాలేజ్, ఆశ్రమ సంక్షేమ పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రఫి జాన్, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ శ్రీనివాసబాబు, పంచాయతీ కార్యదర్శి గోపి పాల్గొన్నారు.

పెదబయలు: మండల కేంద్రంలో ఎస్ఐ పులి మనోజ్ కుమార్, జి.మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ ఆధ్వర్యంలో స్థానిక బాలుర రెసిడెన్సియల్ జిల్లా పరిషత్ సెంటాన్స్ విద్యార్థులతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

రాజవొమ్మంగిలో మానవహారం

మాట్లాడుతున్న తహశీల్దార్ నాగజ్యోతి

గ్రామం మీదుగా రోడ్డు నిర్మాణం వద్దు

గ్రామసభలో పెద్దూరు గ్రామస్తుల డిమాండ్

ప్రజాశక్తి - అనంతగిరి:ప్రముఖ ప్రర్యాటక ప్రాంతమైన తాడిగుడ జలపాతానికి ఏర్పాటు చేసే రోడ్డు విస్తరణతో తమ పెద్దూరు గ్రామం నష్టానికి గురవుతుందని తెలిపారు. బుధవారం స్థానిక సచివాలయ కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో పెద్దురు గ్రామానికి చెందిన కొంతమంది గిరిజనులు విన్నవించారు. ఆ రోడ్డుకు అనుకొని ఉన్న తాడిగుడ, పాతకోట, మాలింగవలసతో పాటు ఏడు గ్రామాలు ఈ రోడ్డు ఏర్పాటుతో అభివృద్ధి చెందుతుందని గ్రామ సభలో ఆమోదించారు. అనంతరం ఈ గ్రామసభను ఉద్దేశించి తహాశీల్దార్ నాగజ్యోతి మాట్లాడుతూ, స్థానిక ప్రజల అభిప్రాయాలు సేకరించేందుకు ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు గ్రామసభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న ఇల్లు, భూములు ఎంత మేర నష్టానికి గురివుతాయో తెలుసుకునేందుకు గ్రామ సభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొంతమంది పెద్దురు గ్రామానికి చెందిన వ్యక్తులు రోడ్డు నిర్మాణంతో నష్టం జరుగుతుందని చెప్పడం సరికాదని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం పెద్దూరు గ్రామం మీదుగా పాత రోడ్డు నుండి ఏర్పాటు చేయడంతో కొన్ని ఇల్లు మాత్రమే తొలగించవలసి ఉంటుందన్నారు.జిరాయితికి భూమి నష్టం జరగదని, రెవెన్యూ సిబ్బందితో సర్వే నిర్వహించామని ఆమె స్పష్టం చేశారు. అభివృద్ధికి అడ్డు పడవద్దన్నారు. రోడ్డు మార్గం ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు.గిరిజనులకు నష్టం జరిగితే ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కార మార్గానికి కృషి చేస్తామని స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు, ఎంపిపి శెట్టి. నీలవేణి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శంకర్రావు, ట్రైబల్ వెల్ఫేర్ ఏఇ గణేష్, పంచాయతీ సెక్రెటరీ బాలకృష్ణ, మాజీ ఎంపిటిసి జోగులు, మాజీ సర్పంచ్ రమణమ్మ, ఉపసర్పంచ్ అర్జున్, మాజీ వైసీపీ మండల అధ్యక్షుడు శెట్టి ఆనంద్, వార్డు మెంబర్లు వెంకటరావు,చిన్నయ్య, పలు గ్రామాల పెద్దలు గోవింద్, గిరిజనులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఈశ్వరి

పథకాలను ప్రజల చెంతకు చేర్చండి

టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-చింతపల్లి: ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో అందించనున్న ప్రభుత్వ పథకాలను ప్రజల చెంతకు చేర్చేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి సూచించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ, వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందన్నారు. ఎన్డీఏ కూటమి ఏర్పాటుతో వైసిపి ప్రభుత్వానికి ప్రజలు చదరమగీతం పాడారన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం జూలై నెలలో సామాజిక పెన్షన్ 7000 రూపాయలు అందజేయనుందని అన్నారు. ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని ప్రజలకు చేరవేయవలసిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

స్కూలు బస్సులు, ఆటోలపై కొరడా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నిబంధనలు ఉల్లంఘించిన రెండు స్కూలు బస్సులు, మూడు స్కూలు ఆటోలపై బుధవారం కేసులు నమోదు చేసినట్టు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ అధికారి రాజారత్నం మీడియాకు తెలిపారు. తమ ప్రత్యేక బృందాలు భీమిలి, సింహాచలం తదితర ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించి సదరు వాహనాలపై కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు. ఈ నెల 13 నుంచి ఇప్పటి వరకూ 34 కేసులు నమోదు చేసి, ఒక బస్సును సీజు చేశామని తెలిపారు. 21 ఆటోలపై కేసులు నమోదు చేసి ఒక ఆటోను సీజు చేసినట్టు వెల్లడించారు. బుధవారం జరిగిన తనిఖీలలో మోటారు వాహన తనిఖీ అధికారులు ఐ.వేణుగోపాలరావు, బాలాజీరావు, ఎంఎస్‌వి.ప్రకాశరావు, రాజారావు తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

శ్వేతపత్రాలతో వెలుగులోకి అక్రమాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపి ప్రభుత్వంపై త్వరలో శ్వేత పత్రాలు విడుదల చేస్తామని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వంలో జరిగిన తప్పులుపై కూటమి ప్రభుత్వం శ్వేతపత్రాలు విడుదల చేయాలని నిర్ణయం తీసుకుందని తెలిపారు. అవి విడుదలైతే జగన్మోహన్ రెడ్డి అక్రమాలు ప్రజలకు తెలుస్తాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో ప్రభుత్వ స్థలాల్లో ప్రజాధనంతో రుషికొండ ప్యాలెస్‌ను మించి వైసిపి కార్యాలయాలు కట్టారన్నారు. ఒంగోలు మినహా రాష్ట్రంలో నిర్మించిన 25 వైసిపి కార్యాలయాలకూ అనుమతులు లేవని చెప్పారు. రాష్ట్రంలో ప్రైవేటు స్థలాలు కబ్జా చేసి మరీ వాటిని నిర్మించారన్నారు. జీవితకాలం తానే ముఖ్యమంత్రిగా ఉంటానని జగన్మోహన్ రెడ్డి భావించి ఇష్టం వచ్చినట్లు వ్యవహరించారన్నారు. అనకాపల్లిలో కాపు భవనం కోసం స్థలం కేటాయిస్తే ఆ స్థలంలో వైసిపి కార్యాలయం నిర్మించారని చెప్పారు. గతంలో టిడిపి నాయకుల భవనాలను కూల్చేశారన్నారు. అనుమతులు లేకుండా కట్టిన వైసిపి కార్యాలయాలను అధికారులు వెంటనే కూల్చి వేయాలని, ఆ భూములను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. ప్రైవేటు వ్యక్తులు దగ్గర వైసిపి తీసుకున్న స్థలాలను మరలా వారికి అప్పగించాలన్నారు. సమావేశంలో పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్, జివిఎంసిలో టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పించన్ సొమ్ము విడుదల

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని 24 మండలాలు, యలమంచిలి, నర్సీపట్నం మున్సిపాల్టీలు, అనకాపల్లి అర్బన్‌లో 2,64,023 మంది పింఛన్‌దారులకు ఎన్‌టిఆర్ భరోసా సామాజిక భద్రత సొమ్ము రూ.174.67 కోట్లును ప్రభుత్వం విడుదల చేసింది. పెంచిన పింఛన్ డబ్బులను జులై ఒకటి నుంచి సచివాలయ ఉద్యోగులతో ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు అందించనుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లుగీత, మత్స్యకార, ఒంటరి మహిళలు, ట్రాన్స్‌జండర్, డప్పు కళాకారులు, తదితర పింఛన్‌దారులకు రూ.4 వేలను అందించనుంది. ఇది గతం కంటే రూ.వెయ్యి ఎక్కువ. అలాగే వారికి ఏప్రిల్, మే, జూన్ నెలకు సంబంధించి నెలకు వెయ్యి చొప్పున మూడు వేలు కలిపి మొత్తం రూ.7 వేలను జులై ఒకటిన ఇవ్వనుంది. వికలాంగులు, క్షయరోగుల పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు, పూర్తి అంగవైకల్యంతో బాధపడుతున్న వికలాంగులకు రూ.5 వేల నుంచి రూ.15 వేలకు, కిడ్నీ, లివర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల పింఛన్‌ను రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచి ప్రభుత్వం ఇవ్వనుంది. దీంతో జిల్లాలోని పింఛన్‌దారులకు ఇచ్చే సొమ్ము రూ.77 కోట్ల నుంచి ఈసారి రూ.174.67 కోట్లకు పెరిగింది.

ఇళ్ల బిల్లులపై ఆశ

- టిడిపి హయాంలో నిర్మించిన గృహాలకు నేటికీ చెల్లించని సొమ్ము
- నిర్మాణ, వడ్డీ భారంతో లబ్ధిదారుల అవస్థలు
- కొత్త ప్రభుత్వం కనికరించేనా..!

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

టిడిపి ప్రభుత్వంలో ఎన్‌టిఆర్ గృహ పథకం కింద నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు రాని పేదల్లో మళ్లీ ఆశ మొలకెత్తింది. జిల్లాలో 2019 వరకు మంజూరైన ఇళ్లల్లో పూర్తికాని వాటికి వైసిపి ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి బిల్లులు చెల్లిస్తామని చెప్పినా, పైసా కూడా విదిలించలేదు. కట్టిన ఇంటి నిర్మాణానికి బిల్లు ఇవ్వకపోవడంతో పేదలు చేసిన అప్పులు, తనఖా పెట్టిన వస్తువులు ఈనాటికీ కొంతమంది పేదలు విడిపించుకోలేకపోయారు. ఇంటి నిర్మాణ భారానికి వడ్డీ తోడవడంతో పేదలు నేటికీ బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన కాలంలో నిర్మించిన ఇళ్లకు బిల్లులు చెల్లిస్తారన్న ఆశ లబ్ధిదారుల్లో కలుగుతోంది.

జిల్లాలోని చోడవరం, మాడుగుల, అనకాపల్లి, పెందుర్తి, యలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజక వర్గాల్లో 2018-19 వరకు 2,12,864 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో పెందుర్తి నియోజకవర్గంలో రెండు ఇళ్ల నిర్మాణం పేదలు ప్రారంభించలేకపోయారు. ప్రారంభించిన 2,12,864 ఇళ్లల్లో నిర్మాణాలు పూర్తి చేసుకోగలిగిన 57,235 మంది లబ్ధిదారులకు అప్పట్లో ప్రభుత్వం డబ్బులు చెల్లించింది. స్లాబ్ వేసుకున్న ఇళ్లకు కూడా బిల్లులు చెల్లించింది. ఈ రెండు స్థాయిల్లోని ఇళ్ల నిర్మాణాలకు రూ.37.62 కోట్లు అందజేసింది. బేస్‌మెంట్‌లోపు, బేస్‌మెంట్, లింటల్ లెవల్, రూఫ్ లెవల్‌లో ఇళ్లు కట్టుకున్న సుమారు 21,490 మంది లబ్ధిదారులకు వైసిపి ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. వాటిని పూర్తిచేసే నిర్ణయం తీసుకోలేదు. ఇళ్లు మంజూరుకాకుండా.. ఎమ్మెల్యేలు చెప్పిన ప్రకారం కట్టుకున్న ఇళ్లంటూ బిల్లులు ఇవ్వలేదు. దీంతో నిర్మాణాలు ముందుకు సాగలేదు. అయితే ఆ లబ్ధిదారుల ఆశలు ఇప్పుడు నెరలేరేలా ఉన్నాయి. గత టిడిపి ప్రభుత్వ కాలంలో ఇళ్లు కట్టుకొని బిల్లుల రాని పేదల జాబితాపై నివేదికను ప్రభుత్వం కోరుతుందన్న అంచనాతో గృహనిర్మాణ శాఖాధికారులు నివేదిక తయారుచేస్తున్నారు. దానిలో వివిధ స్థాయిల్లో ఇంటి నిర్మాణం చేసుకున్న 21,488 మందికి బిల్లులు ఇవ్వలేదని ప్రాథమికంగా గుర్తించారు.

నియోజకవర్గాల వారీగా బిల్లులు అందని ఇళ్ల లబ్ధిదారులు

నియోజకవర్గం	లబ్ధిదారులు
మాడుగుల	3542
అనకాపల్లి	2043
పెందుర్తి	1279
యలమంచిలి	2823
పాయకరావుపేట	4321
నర్సీపట్నం	4473

వైద్య బృందాలు చుట్టుమెట్ట గ్రామాన్ని సందర్శించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇటీవల అల్లూరి జిల్లా పెదబయలు మండలం చుట్టుమెట్ట గ్రామంలో మూఢనమ్మకాల ప్రభావంతో సరైన వైద్య సదుపాయాలు లేక ఇద్దరు చనిపోయిన నేపథ్యంలో ఆ గ్రామాన్ని వైద్య బృందాలు సందర్శించాలని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యులు జె.రవి, రాష్ట్ర నాయకులు టి.శ్రీరామమూర్తి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామస్తుల అమాయకత్వాన్ని, అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని గిరిగ్రామాల్లో భూత వైద్యులు తమ పబ్బంగడుపుకుంటున్నారని తెలిపారు. తక్షణమే పెదబయలు తహశీల్దార్ వైద్య బృందాలను తీసుకొని ఆ గ్రామాన్ని పర్యటించి సరైన వైద్యాన్ని ప్రజలకు అందించాలన్నారు. దెయ్యం, పూనకాలు వంటివి అబద్ధాలని తెలియజేయడమే కాకుండా వాటిపై సరైన అవగాహనను ప్రజలకు కల్పించాలని కోరారు.

28 నుంచి అరకు వ్యాలీలో ఫొటోగ్రఫీ సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వాల్తేరు ఫొటోగ్రఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ కెమెరా దినోత్సవం సందర్భంగా ఈ నెల 28, 29, 30వ తేదీలలో మూడు రోజులు పాటు అరకు వ్యాలీ వేదికగా నేచర్, ల్యాండ్స్‌సెప్, స్టిల్ లైఫ్‌పై ఫొటోగ్రఫీ సదస్సు జరగనుందని సొసైటీ కార్యదర్శి, సీనియర్ ఫొటో జర్నలిస్ట్ ఎంవి.శ్రీనివాస్ రెడ్డి మీడియాకు తెలిపారు. ఆ సదస్సుకు చెన్నయ్, కాకినాడ, రాజమండ్రి, చీరాల, హైదరాబాద్ ప్రాంతాల నుంచే కాకుండా పలు ఫొటోగ్రఫీ క్లబ్స్ నుంచి స్థానిక ఫొటోగ్రాఫర్లు హాజరవుతారని తెలిపారు.

విశాఖ పోర్టులో అగ్నిమాపక వాహనాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పోర్టు ఫైర్ సర్వీస్ స్టేషన్ అవసరాల నిమిత్తం రెండు అగ్నిమాపక వాహనాలను విశాఖపట్నం పోర్టు అథారిటీ ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, పలువురు పోర్టు విభాగాధిపతులు, అధికారులు పాల్గొన్నారు. ప్రమాదాల నియంత్రణకు ఇవి ఎంతగానో దోహదపడతాయన్నారు.

రైళ్ల రద్దు నేపథ్యంలో ఉన్న కొద్దిపాటి రైళ్ల రిజర్వేషన్ల బోగీల్లో కిక్కిరిసిన ప్రయాణికులు

రైళ్ల రద్దుతో జనం అవస్థలు

- సింహాద్రి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లు తరుచూ క్యాన్సిల్
- విజయవాడలో భద్రతా పనులే కారణమంటున్న రైల్వే
- సామాన్యులపై విపరీత ప్రయాణ భారం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అతి తక్కువ ఖర్చుతో సుదూర ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేసే సామాన్యుని రవాణా సాధనం రైలు బండి. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత నానాటికీ ఆ తరగతికి ఆ రైలు బండి అందకుండా పోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. విశాఖ నుంచి, విశాఖ మీదుగా వెళ్లే పలు రైళ్లు నిత్యం అవస్థల ప్రయాణాన్నే మిగుల్చుతున్నాయి. దీంతో పాసింజర్లు తీవ్ర అసౌకర్యానికి, ఆవేదనకూ గురౌతున్నారు. వాల్తేరు రైల్వేలో ఈ పరిస్థితులను అధిగమించలేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. రైళ్ల రద్దు, టెర్మినేషన్ అనేవి తాత్కాలికమేనని, విజయవాడ డివిజన్‌లో భద్రతా పనులే దీనికి కారణమని రైల్వే ఉన్నతాధికారులు వెల్లడిస్తున్నారు. సింహాద్రి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లను నెలల పాటు రద్దు చేసిన క్రమంలో సామాన్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్రమంగా రైళ్లు సామాన్యునికి దూరమవుతాయా ? అనే అనుమానాలు పలువురిని కలచివేస్తున్నాయి. పొద్దస్తమానం రైళ్ల రద్దుతో విసిగి వేసారే ప్రయాణికులు వ్యక్తిగత రవాణా వైపు దృష్టిసారించేలా రైల్వేల్లో పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. దేశంలో డజన్ల కొద్దీ పాసింజర్ రైళ్ల కుదింపు, వాటి బోగీలకు కొద్దిపాటి మార్పులు చేసి అధిక ఆదాయం వచ్చే వందేభారత్, ఇతర రైళ్లకు అమర్చే విధానం కూడా రైలు ప్రయాణికులను తీవ్ర ఇక్కట్లపాల్జేస్తోంది.

ప్రజల ఆందోళనతో కొంత దిగొచ్చిన రైల్వే

వాల్తేరు రైల్వేలో రత్నాచల్, జన్మభూమి రైళ్లకు ఎంతో ప్రాధాన్యం ఉంది. విశాఖ లేదా ఉత్తరాంధ్ర ప్రాంతాల ప్రయాణికులకు ఆ రైళ్లు ఎంతో సౌకర్యవంతంగా ఉండేవి. వాటిని తొలుత ఆగస్టు వరకూ రద్దు చేస్తున్నట్లు రైల్వే ప్రకటించింది. ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో రైల్వే శాఖ దిగొచ్చి జన్మభూమిని ప్రస్తుతానికి పునరుద్ధరించింది. ఇవి కాకుండా మరో ఏడు రైళ్లు కూడా నిత్యం రద్దవుతున్నాయి.

వాల్తేరు డివిజన్‌లో మళ్లీ పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజన్‌లోని పుండి-నౌపడ మెయిన్ లైన్‌లో వంతెన పునర్నిర్మాణ పనులు, ఇతర భద్రతా సంబంధిత ఆధునికీకరణ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు, రీ షెడ్యూల్ చేశారు. ఈ క్రమంలో 08546 విశాఖపట్నం - కోరాపుట్ ప్యాసింజర్ స్పెషల్ రైలును జూన్ 26న రద్దు చేశారు. అలాగే 07471 పలాస-విశాఖపట్నం ప్యాసింజర్‌ను, 08522 విశాఖపట్నం - గుణుపూర్ ప్యాసింజర్‌ను, 07470 విశాఖపట్నం - పలాస ప్యాసింజర్‌ను, 08521 గుణుపూర్ - విశాఖపట్నం ప్యాసింజర్‌ను, 08545 కోరాపుట్ - విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్ రైళ్లను జూన్ 27న రద్దు చేసారు. అలాగే 8417 పూరీ-గుణుపూర్ ఎక్స్‌ప్రెస్‌ను జూన్ 27న షెడ్యూల్ సమయం 12.00 గంటలకు బదులు 2 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 14.00 గంటలకు రీషెడ్యూల్ చేశారు. 12830 భువనేశ్వర్ - ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను జూన్ 27న షెడ్యూల్ సమయం 12.10 గంటలకు బదులుగా 3 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 15.10 గంటలకు రీషెడ్యూల్ చేశారు. 08527 రాయ్‌పూర్ - విశాఖపట్నం ప్యాసింజర్ జూన్ 27న షెడ్యూల్ సమయం ఉదయం 05.20 గంటలకు బదులుగా 2 గంటలు ఆలస్యంగా 7.20 గంటలకు రీషెడ్యూల్ చేశారు.18189 టాటానగర్ - ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌ను జూన్ 27న షెడ్యూల్ సమయం ఉదయం 05.15 గంటలకు బదులు 2 గంటలు ఆలస్యంగా 07.15 గంటలకు రీషెడ్యూల్ చేశారు.